

ఉల్లాస్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్

జామి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అట్టాడ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఉల్లాస్ పరీక్షలను కలెక్టర్ అంబేడ్కర్ పరిశీలించారు. ఆదివారం పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష నిర్వహణ తీరును గమనిస్తూ సిబ్బందితో మాట్లాడారు. పరీక్ష రాస్తున్న వారితోనూ మాట్లాడారు.



గృహానందం

ఇంటి నిర్మాణాన్ని మధ్యలో ఆపేసిన పేదలకు గృహయోగం పట్టనుంది. సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సాయం ప్రకటించింది. వివిధ కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయి ఉన్నాయి. అవన్నీ ఉపయోగం లేకుండా పడి ఉన్నాయి. నానాటికీ శిథిలమయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వాటిని పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. అదనపు ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని పేదలు స్వాగతిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 15,226 ఇళ్లు మధ్యలో నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు.

- పేదల ఇళ్లకు సాయం
- 15,226 ఇళ్ల నిర్మాణదారులకు ఉపయోగం
- ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు
- ఎస్టీలకు రూ.75 వేలు
- పీవీటీజీలకు రూ.లక్ష
- ప్రకటించిన ప్రభుత్వం



అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు

సంఖ్య	కేటగిరీ	పీవీటీజీఎస్	ఎస్టీ	ఎస్సీ	బీసీ	మొత్తం
1.	బీఎల్సీ అర్బన్	0	564	2,162	12,097	14,823
2.	గ్రామీణం	0	1	69	143	213
3.	పీఎం-జన్మన్	190	0	0	0	190
		190	565	2,231	12,240	15,226

విజయనగరం, మార్చి23 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మధ్యలో నిలిచిపోయిన ఇళ్లు అత్యధికంగా గత ప్రభుత్వం లోనివే. ప్రభుత్వ సాయం సరిపడక.. ముడి సామగ్రి ధరలు, ఇసుక ధరలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ పూర్తి చేయలేక వదిలేశారు. వాటికి నేడు మోక్షం కలగ నుంది. గతంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్, గ్రామీణ పథకాల కింద ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు ఆర్థిక సాయం అందింది. ఈ సాయంతో ఇంటి నిర్మాణం పూర్తికాకపోవడంతో జిల్లాలో 15,226 ఇళ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇళ్ల లబ్ధిదారుల్లో బీసీలకు, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ, గిరిజన తెగలకు రూ.లక్ష సాయాన్ని తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. ఇళ్లు మంజూరై (మిగతా 8వ పేజీలో..)



టీబీ కేర్‌ఫుల్

- జిల్లాలో తగ్గని క్షయ (టీబీ) బాధితులు
- వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

క్షయ (టీబీ) జిల్లాను పీడిస్తోంది. గతంతో పోలిస్తే కేసులు కాస్త తగ్గినా పూర్తిగా అదుపులోకి రావడం లేదు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ కేసులు వస్తున్నాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలికంగా దగ్గు వస్తున్నా సాధారణమే కదా అని తేలిగ్గా తీసుకుంటున్నారు. రెండు వారాలకు మించి దగ్గు వేధిస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్లె పరీక్ష చేయించుకోవాలి. ఆదిలోనే సరైన వైద్యం తీసుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదని వైద్యులు చెబుతున్నారు.

క్షయవ్యాధి కారకమైన బ్యాక్టీరియా (మైకో బాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్)ను డాక్టరు కోచ్ కనుగొన్న తర్వాత శతాబ్ది వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా 1942 నుంచి ఏటా మార్చి 24న ప్రపంచ టీబీ దినం పాటించా లని చెప్పింది. ఈ రోజున దేశవ్యాప్తంగా వ్యాధి తీవ్రతపై చర్చలు నిర్వహించడం.. నివారణ మార్గాలను సూచించడం.. భవిష్యత్ కార్యాచరణకు వైద్యశాఖ ప్రణాళిక రూపొందించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా దీర్ఘకాలికంగా దగ్గు వస్తుంటే తేలిగ్గా తీసుకోకూడదు. రెండు వారాలకు మించి దగ్గు వేధిస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్లె పరీక్ష చేయించుకోవాలి. దీర్ఘకాలిక దగ్గు క్షయ లక్షణం కావచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో పరీక్షలు చేయించుకుని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఔషధాలను సకాలంలో వాడితే క్షయ వ్యాధి తప్పకుండా నయం అవుతుంది. లేని పక్షంలో మొండిగా మారి కొన్ని సందర్భాల్లో ప్రాణాలు హరించే ప్రమాదం వుంది.

లక్షణాలు ఇవే..


రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు పడడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆలసటగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రధానంగా 60 ఏళ్ల దాటిన వృద్ధులు, సుగర్ వ్యాధిగ్రస్థులు, పొగ ఇతర మత్తుపదార్థాలు వాడే వారిలో టీబీ ఎక్కువగా కనిపిస్తుంటుంది.

జిల్లాలో కేసులు ఇలా..

సంవత్సరం	చేపట్టిన పరీక్షలు	నమోదైన కేసులు
2022	33,111	3,403
2023	43,820	3,160
2024	64,736	2,826
2025 (ఫిబ్రవరి వరకూ)	53,428	585



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో క్షయ నిర్ధారణ చేసే సీబీనాట్ పరికరం



నిర్ధారణ ఇలా..

క్షయవ్యాధి నిర్ధారణకు పలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఎక్స్‌రే, సీబీనాట్ పరీక్ష ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ చేస్తారు. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లోనూ టీబీ నిర్ధారణ పరీక్షలకు అవకాశం ఉంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని టీబీ కేంద్రంలో కాట్రిడ్జ్ బేస్డ్ యూక్లిక్ యాసిడ్, యాంప్లిఫికేషన్ టెస్ట్ (సీబీనాట్) పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉచితంగా చికిత్స..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలను ఉచితంగా అందజేస్తున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ జరిగిన రోగులకు ఔషధాలను ఆరు నెలల పాటు ఉచితంగా అందజేస్తారు. ఈ ఔషధాలు క్రమం తప్పకుండా వాడితే టీబీ పూర్తిగా తొలగిపోతుంది. అలాగే వీరికి పోషకాల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి నెలా వెయ్యి రూపాయలు అందజేస్తున్నారు.

అవగాహనతోనే నివారణ..



అవగాహనతోనే క్షయవ్యాధిని నిర్మూలించవచ్చు. టీబీ నిర్ధారణకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేసి ఔషధాలను అందజేస్తున్నాం. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. టీబీ వ్యాధిగ్రస్థులు వైద్యుల సూచన మేరకు ఖచ్చితంగా ఔషధాలను వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతుంది. టీబీ వ్యాధికి నేడు అత్యాధునిక వైద్యం, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. నిర్మూలనకు ప్రభుత్వం కూడా ఎంతగానో కృషి చేస్తోంది.

– డాక్టరు ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

గురుకులాల్లో సీసీ కెమెరాలు

- పెన్సింగ్ ఏర్పాటుకూ చర్యలు
- ఏపీ గురుకులాల సొసైటీ కార్యదర్శి మస్తానయ్య



బొబ్బిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏపీ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఎస్‌వీ మస్తానయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ గురుకులానికి ఆదివారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సమీపంలోని ఎస్ఎం పురంలో 20 ఎకరాల్లో ఉండే గురుకుల స్థలం పెద్దఎత్తున ఆక్రమణకు గురైందని, ప్రస్తుతం 11 ఎకరాలకే పరిమితం అయిందన్నారు. బొబ్బిలిలో కూడా ఆక్రమణలకు అవకాశం ఉందని, అందుకే అన్ని చోట్లా కంచెల నిర్మాణం కూడా అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఇందుకోసం దాతల సహకారాన్ని కోరుతున్నామన్నారు. బొబ్బిలి గురుకులానికి కొంతమేర పెన్సింగ్ వేశామని, మిగిలిన భాగానికి బయో పెన్సింగ్ వేయాలని ప్రిన్సిపాల్ రఘునాథ్‌ను ఆదేశించారు.

● గురుకులాల్లో పెద్దసంఖ్యలో రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. బొబ్బిలి గురుకులంలో 18 ఉండాల్సిన రెగ్యులర్ స్టాఫ్‌లో కేవలం నలుగురు మాత్రమే ఉన్నారన్నారు. సరైన వసతులు లేని కారణంగా గురుకులాల్లో సిబ్బంది ఎవరూ రాత్రివేళల్లో ఉండడం లేదని, దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, ఇది గురుకుల వ్యవస్థకు విరుద్ధమన్నారు. ఉద్యోగుల కుటుంబాలు నివాసం ఉండేలా తగిన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవనాల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. కనీసం సగం సిబ్బందైనా గురుకులాల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తాటిపూడి గురుకులానికి ఉపాధి హామీ పథకం కింద ప్రహరీ నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు. బొబ్బిలి గురుకులం పట్టణ ప్రాంతం కావడంతో ఉపాధి హామీ పథకం వర్తించడం లేదని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దాతలు, స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు చొరవ చూపి అన్ని గురుకులాలను ఆధునిక స్థాయిలో అభివృద్ధి చేసుకునేందుకు చేయి చేయి కలపాలని మస్తానయ్య కోరారు.

ఏడుగురికి సేవా పతకాలు

ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన: ఎస్పీ 7

గౌరవం లేని పదవులు ఎందుకు?

గజపతినగరం మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన 7

విద్యుత్ లేక.. వెలుగులకు నోచుకోక

8

- అటవీశాఖ నుంచి అనుమతులు రాని వైనం
- గోపాలరాయుడుపేట పంచాయతీ గిరిజన గ్రామాల్లో పరిస్థితిదీ



డంపింగ్ యార్డుగా మారి'నది'

జామి వద్ద గోస్తని తీరంలో పేరుకుపోయిన చెత్త 8

విజిలెన్స్ కేసుల నుంచి ఇంజనీర్లకు విముక్తి

- జీవో జారీ చేసిన ప్రభుత్వం

8

గ్రామ పురోణీలపై ఆరా

- మండలాల వారీగా వివరాలు సేకరించిన రెవెన్యూ అధికారులు
- తహసీల్దార్ల నుంచి సమాచారం సేకరించిన ఉన్నతాధికారులు
- క్రమబద్ధీకరించే ఆలోచనలో ప్రభుత్వం



గ్రామ పురోణీ(సాదాబైనామా)



విజయనగరం కలెక్టరేట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేలో అధికారులకు అందుతున్న వినతుల్లో ఎక్కువగా గ్రామ పురోణీలకు(సాదాబైనామాలు) సంబంధించినవే ఉన్నాయి. వీటిని పరిష్కరిస్తే గ్రామాల్లో భూ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. మండల అధికారుల్లో గ్రామ పురోణీలపై ఇటీవల అనేక చర్చలు జరిగాయి. మండల అధికారుల నుంచి జిల్లా అధికారులకు నివేదికలు వెళ్లాయి. వాటిపై స్పందించిన భూపరిపాలన అధికారులు మండలాల వారీగా ఉన్న గ్రామ పురోణీలపై ఆరా తీశారు. అవి ఏ విధంగా ఉన్నాయి. వివాదాలు చోటుచేసుకోకుండా వాటిని ఎలా పరిష్కరించుకోగలం.. ఎంత సంఖ్యలో ఉన్నాయి... తదితర వివరాలను ఉన్నతాధికారులు అడిగారు. వీటిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం కొద్ది రోజుల్లో జీవో ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇదే విషయాన్ని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ రెవెన్యూ అధికారి చెప్పారు.

ఇరవై సంవత్సరాల క్రితం గ్రామాల్లో చాలా మంది రైతులు తోటి రైతుల భూములను కొనుగోలు చేసేటప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా తెల్లకాగితం, స్టాంప్ పేపర్ రాసుకునేవారు. వాటినే గ్రామపురోణీ(సాదాబైనామాలు)లు అంటున్నాం. సంవత్సరాల తరబడి భూ లావాదేవీలకు పురోణీలే ఆధారంగా ఉండేవి. ఎలాంటి సమస్య ఉండేది కాదు. ఉమ్మడి కుటుంబాల విభజన, వెబ్‌ల్యాండ్ రాక తర్వాత భూముల రికార్డుల నవీకరణ కావడంతో ఆయా పురోణీల్లో ఉన్న భూముల వివరాలు కూడా ఆన్‌లైన్ చేయాల్సి వస్తోంది. చేయకుంటే భూముల అమ్మకం చేసేటప్పుడు సరిహద్దు తగాదాలు, భూ హక్కు సమస్యలు వస్తున్నాయి. సంవత్సరాలుగా పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వీటిపై ఈ ప్రభుత్వం దృష్టిసారించింది. పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.

2010లో కూడా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అప్పటి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అప్పట్లో కొద్ది రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో చాలా మంది వినియోగించుకో లేకపోయారు. 2014 నుంచి 2019 వరకూ ఉన్న టీడీపీ ప్రభుత్వంలోనూ (మిగతా 8వ పేజీలో..)

ఏడుగురికి సేవా పతకాలు

●ఎస్పీ వకుల్ జిందాల్ ●ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

విజయనగరం క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలకుగాను, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండుగ సందర్భంగా పోలీసు మెడల్స్‌ను ప్రకటించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందికి ఉగాది పండుగ సందర్భంగా పోలీసు సేవా మెడల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పోలీసుశాఖ పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పోలీసుశాఖలో ఎస్‌బీ ఎస్‌ఐ వై.సత్యనారాయణకు ఉత్తమ సేవాపతకం, ఎస్సీ-ఎస్టీ సెల్ ఏఎస్‌ఐ ఎం.ప్రసాదరావుకు సేవా పతకం, గుర్ల పోలీస్ స్టేషన్‌లోని హెచ్‌సీలు పి.రమణ, కె.గోపాలరావులకు సేవాపతకాలు, ఏఆర్ ఎస్‌ఐ కె.అప్పలరాజు, ఏఆర్ హెచ్‌సీ ఎం.గోవిందం, ఏఆర్ పీసీ బి.శ్రీనివాసరావు సేవా పతకాలకు ఎంపికైనట్టు రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసి నట్టు ఎస్పీ వకుల్ జిం దాల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ప్రతిష్ఠను రాష్ట్రస్థాయిలో నిలిపి ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవా, సేవా పతకాలు పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష త్తులో పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు.


సత్యనారాయణ, ఎస్‌బీ ఎస్‌ఐ


అప్పలరాజు, ఏఆర్ ఎస్‌ఐ


ప్రసాదరావు ఎస్సీ, ఎస్టీ సెల్ ఏఎస్‌ఐ


రమణ, హెచ్‌సీ


గోవిందం, హెచ్‌సీ


శ్రీనివాసరావు, కానిస్టేబుల్


గోపాలరావు, కానిస్టేబుల్

కొత్తవలసకు ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి


న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తవలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ జిలా కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి ఆదివారం కొత్తవలస కోర్టును సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తవలస కోర్టుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక కోర్టు న్యాయాధికారి డాక్టర్ విజయ్‌చందర్, న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, ప్రధాన కార్య దర్శి డి.శ్రీనివాస్, కె.మహేశ్వరరావు, గవర కృష్ణ శ్రీరామ్మూర్తి, ఉమాదేవి, నాయుడు తదితరులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం కోర్టులో వివిధ కేసులకు సంబంధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

విజయనగరం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను నగరంలోని అయ్యన్న కోనేరుగట్టు వద్ద విజ్ఞాన భారతి స్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా త్యాగరాజస్వామి వేషధారణలో విద్యార్థులు తిరువీధి మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు. త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు.

నేడు కేఎస్ఎస్ కమిటీల ఏర్పాటు

లక్కవరపుకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసం వద్ద సోమవారం నిర్వహించనున్న పార్టీ సమావేశానికి నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం క్షేత్రస్థాయిలో కుటుంబ సాధికార సారధి (కేఎస్ఎస్) కమిటీలు వేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. తప్పనిసరిగా అందరూ రావాలని కోరారు.

క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులు

విజయనగరం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లా పార్టీ కార్యాలయానికి కార్డులు చేరాయి. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 25, 26న జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పంపిణీ చేయనున్నారు.

ఎస్.కోట ఆసుపత్రికి అల్ట్రా సౌండ్‌స్కాన్

శృంగవరపుకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ సిస్టం అందుబాటులోకి వచ్చినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు గర్భిణులు ఈ పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించేవారు. ఇక నుంచి గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కాన్ ఆసుపత్రిలోనే చేపట్టనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

రేగిడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపుర్లిలోని చిన్మయిదేవి సమేత చిదంబరేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ, ప్రధాన ధర్మకర్తల నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంత్‌శర్మ, గ్రామ పురోహితులు మావుడూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

మెరకముడిదాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సింగవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ం ఆర్.ప్రశాంతి కోరారు. ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత సంవత్సరంలో తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, యూనిఫారం, బెల్టు, షూ, బ్యాగు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజాకుమారి, జ్యోతి, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

110 మందికి నేత్ర పరీక్షలు

బొండపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంద్రాంలో ఆదివారం రామదండు యువత ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటైంది. విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు శిబిరానికి హాజరయ్యారు. 110 మంది రోగులను పరీక్షించి అందులో 26 మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు.

●లక్కవరపుకోట: పెదిరెడ్లపాలెంలో ఆదివారం విశ్వమంథా ట్రస్టు అధ్యక్షుడు ఎంఎల్‌వీ శర్మ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 32 మందికి కళ్లద్దాలకు సిఫారుసు చేశారు.

వృద్ధులే ఈతరం సంపద


వృద్ధులకు చీరలు అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

జామి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఈతరానికి అమూల్యమైన సంపద వృద్ధులేనని, వారిని చక్కగా ఆయా కుటుంబాల వారు సంరక్షించుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ అన్నారు. మండలంలోని అట్టాడలోని బీఎన్ఆర్ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులను కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి వారితో మాట్లాడారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు బీశెట్టి శారద, డాక్టర్ బాలభార్గవిలను ప్రశంసించారు. ఎటువంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, సర్పంచ్ అమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు కలెక్టర్‌ను సత్కరించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగండి


కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులైన మహిళలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విభిన్న ప్రతిభావంతుల శిక్షకురాలు వెలిచేటి లక్ష్మి అన్నారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపర్‌మెంట్ విభిన్న ప్రతిభావంతుల మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాటలు రాకపోయినా, సైగల భాషతో ఎంతో మంది మహిళలు నేడు ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో మహిళలు విద్యను అభ్యసించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆశాజ్యోతి, రాధ, హైమావతి, స్వర్ణ, లక్ష్మితో పాటు 120 మంది విభిన్న ప్రతిభావంతుల మహిళలు పాల్గొన్నారు.

ఆత్మకథలు నాటి పరిస్థితులకు ప్రతిబింబాలు


మాట్లాడుతున్న గణపతిరావు నాయుడు

రాజాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యక్తులు రాసుకున్న ఆత్మకథలు ఆనాటి సమాజ పరిస్థితులను ప్రతిబింబిస్తాయని సాహితీవేత్త రౌతు గణపతిరావు నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 12వ సమావేశం జరిగింది. సమావేశంలో ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథను సభ్యులకు గణపతిరావు నాయుడు పరిచయం చేశారు. బరంపురానికి చెందిన లక్ష్మణరావు జర్మనీ దేశస్థురాలు మిల్లి షోలింగర్‌ను వివాహం చేసుకోవడం, ఆ తర్వాత మంచి స్నేహితులుగానే మిగిలిపోవడాన్ని ఆయన వివరించారు. ఆదర్శ దంపతులుగా స్వాతంత్ర ఉద్యమానికి చేసిన సేవను వివరించారు. డాక్టర్ అల్లి మోహనరావు అధ్యక్షతన వహించిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, శాసపు సత్యనారాయణ, మూడడ్ల శ్రీనివాసరావు, పొట్నూరు కోటిబాబు, పొదిలాపు శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్, సమతం మహేశ్వరరావు, కుదమ తిరుమలరావు, జరజాన నీలయ్య, ఉరిటి గున్నేశ్వరరావు, వల్లూరు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 318 మంది ఎంపిక


ఎంపికైన వారితో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ

శృంగవరపుకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద విద్యాసంస్థలో ఆదివారం నిర్వహించిన సంకల్ప్ మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 1450 మంది హాజరు కాగా 318 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి గొంప కృష్ణ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమార్, జామి టీడీపీ మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్, టీడీపీ నాయకురాలు గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, వివేకనంద విద్యాసంస్థల అధిపతి సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ ఉన్నారు.

టీడీపీలో పలువురి చేరిక


టీడీపీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గంట్యాడలోని పలు కుటుంబాలు వైసీపీ నివీడి టీడీపీలో చేరాయి. ఆదివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో వారు చేరారు. పార్టీలో చేరిన వారిలో గంట్యాడకు చెందిన కొండపల్లి వెంకటరమణ, కె.కృష్ణ, కె.రవి, ఎస్.చక్రి, ఇ.గోవింద, కె.సురేష్, కోరాడ పైడితల్లి, కోరాడ రాంబాబుతో పాటు మరో 15 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, టీడీపీ నాయకులు మురళీబాబు, బూడి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

వేములాపల్లి అభివృద్ధి బాధ్యత నాదే..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములాపల్లి పంచాయతీ అభివృద్ధికి పూర్తి బాధ్యత నాదేనని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం వేములాపల్లిలో ఆమె పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోపాలపల్లి సర్పంచ్ మహేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, రామసత్యం, శ్రీనురాజు తదితరులున్నారు.

జడ్పీ చైర్మన్‌ను పరామర్శించిన సాయిరెడ్డి


శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న సాయిరెడ్డి

విజయనగరం దాసన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్‌బాబు మృతి చెందిన నేపథ్యంలో ఆయన్ని ధర్మపురిలోని నివాసంలో మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పడాల అరుణ, శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పేడాడ తిలక్, దువ్వాడ వాణితో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ని పరామర్శించారు.

నాటక పోటీలకు సహకరించండి


మాజీ ఎమ్మెల్యే గద్దెతో నాటక పోటీల నిర్వాహకులు

గరివిడి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గరివిడిలో మే 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలకు సహకరించాలని గరివిడి కళాపరిషత్ సభ్యులు కోరారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారులను కలిశారు. కళాకారులు కలిసిన వారిలో చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, టీడీపీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.త్రిమూర్తులురాజు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మండల టీడీపీ నేతలు ముల్లు రమణ, రెడ్డి గోవింద తదితరులు ఉన్నారు. ఉభయ రాష్ట్రాల తెలుగు నాటకాల పోటీలు విజయవంతం చేసేందుకు కొన్ని రోజులుగా కళాకారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

పేమెంట్ తీర్మానాల పేరిట ఇబ్బందులు

జామి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం పంచాయతీ కార్యదర్శి అనురాధ కొత్త సంప్రదాయాలు అమలు చేస్తున్నారని సర్పంచ్ పార్వతి ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ పనిచేసినా తీర్మానం సరిపోయేదన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి పేమెంట్ తీర్మానాలు అంటూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనివల్ల గ్రామాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. అన్ని పంచాయతీల్లో ఎలా తీర్మానాలు జరుగుతున్నాయో ఇక్కడ కూడా అదే పద్ధతి ఉండేలా చూడాలని అధికారులను ఆమె కోరారు.

దుర్గమ్మ విగ్రహం ధ్వంసం


అమ్మవారి చేతుల్లోని ఆయుధాలు ధ్వంసం చేసిన దృశ్యం

బొండపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోడసింగిపేటలో నిర్మాణమవుతున్న సీతారామాంజనేయుల ఆలయంలోని దుర్గమ్మవారి విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలయ నిర్మాణకర్త, సర్పంచ్ మీసాల జానకిరావు మాట్లాడుతూ ప్రజల విరాళాలతో గ్రామంలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కోవెల ప్రహరీని ఆనుకుని రూపుదిద్దుకున్న దుర్గమ్మ విగ్రహం రెండు చేతులు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయమై ఆయన బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

జరజాపుపేట ఇన్‌చార్జి వైద్యురాలిగా కల్పన

నెల్లిమర్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నెలిమర్ల నగర పంచాయతీలోని జరజాపుపేట యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలిగా కల్పనను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు నియమించారు. జరజాపుపేట యూపీహెచ్‌సీలో ఇంతకాలం పనిచేసిన డాక్టర్ వి.దక్షయ్ రామనాయుడు ఇటీవల ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో నెల రోజులుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. 'స్టాఫ్ నర్సుతో వైద్యసేవలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. డాక్టర్ కల్పనను ఇన్‌చార్జిగా నియమించారు. ఈమె ప్రస్తుతం పూల్‌బాగ్ కాలనీ యూపీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. వారంలో మూడు రోజులు పూల్‌బాగ్ యుపీహెచ్‌సీలో, మూడు రోజులు జరజాపుపేట యూపీహెచ్‌సీలోనూ విధులు నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నట్టు సమాచారం.

పెదమానాపురంలో ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన వాహనాలు

దత్తిరాజేరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం వద్ద వంతెన పనుల్లో భాగంగా ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం జరిగింది. పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వన్‌వే ఇవ్వడంతో రెండువైపులా 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. నెమ్మదిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి. స్పందించిన పోలీసులు ట్రాఫిక్‌ను నెమ్మదిగా క్లియర్ చేశారు. పనులు నిరంతరాయంగా జరగడంతో రోజంతా రద్దీ కొనసాగింది.

భగత్‌సింగ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న మానవత ప్రతినిధులు

రాజాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని సర్దార్ భగత్ సింగ్‌కు వర్ధంతిని ఆదివారం మానవత సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1907లో జన్మించి చిన్నతనంలోనే భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జీవితకాల దేశ బహిష్కరణకు గురయ్యారన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో పేరు పొందారన్నారు. భగత్‌సింగ్ జైలులో ఖైదీగా ఉన్నపుడు సమాన హక్కులు కల్పనకై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.వి.అచ్యుత్‌కుమార్, ఉపాధ్యక్షులు గట్టి పాపారావు, మక్కా అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త పెంకి చైతన్యకుమార్, రాజాం పర్యావరణ సమితి అధ్యక్షుడు ఆర్‌వీజే నాయుడు, యామన భాస్కరరావు, దామెర రాజా, శాసపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని కొండగుంపాంలో ఆదివారం సీపీఐ నిర్వహించింది. సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలు కీర్తించారు. కార్యక్రమంలో పోలిపల్లి సూరి, ఎడ్ల పైడినాయుడు, లంక రాజారావు, నడిపేన రామ్మూర్తి పాల్గొన్నారు.


కొండగుంపాంలో..

గౌరవం లేని పదవులు ఎందుకు?

●మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన

గజపతినగరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌లకు కనీస గౌరవం దక్కడంలేదు.. అధికారులు కనీసం గుర్తింపు కూడా ఇవ్వకుంటే ఎందుకీ సర్పంచ్ పదవులని పాతశ్రీరంగరాజపురం, కాళంరాజపేట, మధుపాడ సర్పంచ్‌లు మండల సమావేశంలో ఆవేదనను వెళ్లగక్కారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ జేఈ అప్పలనాయుడు పల్లె పండగలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులపై మాట్లాడుతుండగా గ్రామాల్లో గ్రామసభలు ద్వారా తీర్మానాలు చేసిన పనులు గ్రామాల్లో జరగడం లేదని మధుపాడ సర్పంచ్ అన్నారు. పంచాయతీలో 24 పనులకు తీర్మానం చేస్తే నాలుగు పనులే చేపడుతున్నారనీ, అదీ సర్పంచ్‌కు తెలియజేయకుండా చేపట్టడం ఎంత వరకు సమంజసం అని జేఈని నిలదీశారు. గ్రామంలో అంగన్వాడీ భవనం పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు రావడం లేదని అధికారులు చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని కాళంరాజపేట సర్పంచ్ ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లను అధికారులు తిప్పుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గ్రామానికి అధికారులు వస్తే వారికి సర్పంచ్‌లు అవసరం.. కానీ సర్పంచ్‌ల అవసరాలకు అధికారులు ఉపయోగపడరా అంటూ పాతశ్రీరంగరాజపురం సర్పంచ్ గిడిజాల కామునాయుడు ప్రశ్నించారు దీంతో ఎంపీడీవో బి.కల్యాణి మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామానికి ప్రథమ పౌరులని, వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు సర్పంచ్‌లతో పాటు గ్రామపెద్దల సమక్షంలో చేపట్టేలా కృషి చేయాలని సూచించారు. ప్రతీ సమావేశానికి తహసీల్దారు గానీ డీటీ గానీ గైర్హాజరు కావడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాళంరాజపేట సర్పంచ్

గంటలోనే ముగిసిన సమావేశం

●పలు శాఖలపై జరగని సమీక్ష
●గరివిడి మండల సమావేశం తీరిది..

గరివిడి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు మూడు నెలలకు ఒకసారి మండల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశం సుదీర్ఘంగా సుమారు 3 గంటల పాటు వాడివేడిగా జరగాల్సి ఉంది. కానీ ఆదివారం ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా గంటలోనే ముగిసింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ సమావేశం కోరం చాలక పోవడంతో 11.30 గంటలకు ప్రారంభమై 12.30 గంటలకు ముగిసింది. చాలా వరకు కొన్ని శాఖలపై సమావేశంలో సమీక్ష కూడా నిర్వహించలేదు. మండలంలో 20 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ 13 మంది, 30 మంది సర్పంచులకు గానూ 10 మందే హాజరయ్యారు. వివిధ శాఖల పరిధిలో 20 మంది అధికారులు, సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో గెడ్డపువలస సర్పంచ్ టి.సూరినాయుడు మాట్లాడుతూ డీఎఫ్ఎస్, గెడ్డపువలస ప్రాంతాలలో పరిమితికి మించి మైనింగ్ తవ్వకాలు జరగడం వల్ల తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. కోనూరు, వెదుళ్లవలస సర్పంచ్‌లు మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. రేగటి సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ తమ పంచాయతీలో గతేడాదిగా పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. పాత గరివిడి ఎంపీటీసీ ఎడ్ల సూరిబాబు మాట్లాడుతూ గర్భాం రోడ్డులో రహదారి నుంచి వస్తున్న కాలుష్య సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు బంగార్రాజు, ఎంఈవో పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

దిబ్బగుడ్డివలసలో బోరుకు మరమ్మతులు

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బగుడ్డివలస మొదటివీధిలో ఉన్న చేతిపంపునకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈనెల రెండో తేదీన ఆంధ్రజ్యోతిలో మరమ్మతుకు నోచుకోని చేతిపంపు శీర్షికతో ప్రచురితమైన కథ నానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా దిబ్బగుడ్డివలసలో పాడైన చేతిపంపును మరమ్మతుచేయడంతో 15 కుటుం బాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

విజిలెన్స్ కేసుల నుంచి జలవనరుల శాఖ ఇంజనీర్లకు విముక్తి

● జీవో జారీ చేసిన ప్రభుత్వం

బొబ్బిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పలువురు జలవనరుల శాఖ ఇంజనీర్లు, ఇతర అధికారులకు విజిలెన్స్ కేసుల నుంచి విముక్తి లభించింది. ఈమేరకు 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకంలో అవకతవకలు జరిగాయని వైసీపీ ప్రభుత్వం పలువురు జలవనరులశాఖ ఇంజనీర్లు, ఇతర అధికారులపై విజిలెన్స్ కేసులు నమోదుచేసిన విషయంవిదితమే. ఈనెల 11న ఇందుకు సంబంధించి జీవో-100ను జారీచేయడంతో సంబంధిత ఇంజనీర్లు, అధికారులకు విజిలెన్స్ కేసుల నుంచి ఉపశమనం లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 386 మంది జలవనరులశాఖ అధికారులకు విముక్తికలిగింది. నీరు-చెట్టుపథకంలో నిధులు దుర్వినియోగమయ్యాయని వైసీపీప్రభుత్వ హయాంలో ఆ పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులను నిలిపివేసింది. అంతేకాకుండా ఆ పనులకు విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టింది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బృందాలను నియమించి నీరు-చెట్టు పనులపై విచారణ జరిపించింది. దీంతో పనులు చేపట్టిన వందలాది మంది కాంట్రాక్టర్లు, బిల్లులు ప్రతిపాదించిన ఇంజనీర్లు ఒత్తిడికి గురయ్యారు. చేపట్టిన పనులకు బిల్లులు అందక, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోలేక గ్రామ స్థాయి కాంట్రాక్టరు అవస్థలుపడ్డారు. బిల్లులకోసం అనేకమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. అయినా గత ప్రభుత్వం బిల్లుల చెల్లించకుండా తాత్సారం చేసింది. కాంట్రాక్టర్లు మళ్లీ కోర్టు ధిక్కార కేసులు పెట్టారు.దీంతో కోర్టు చెల్లింపులకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో చెల్లింపుల ప్రక్రియను నిర్వహించారు.ఈలోగా రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విజిలెన్స్ కేసులు ఎత్తివేయాలని నిర్ణయించింది.విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్న జలవనరుల శాఖకు చెందిన ఇంజనీర్లు, ఇతర అధికారులకు తాజాగా వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వులతో ఉపశమనం లభించింది.

జలవనరుల శాఖ డీఎస్ఈగా భాస్కరరావు

బొబ్బిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో 2019నుంచి ఖాళీగాఉన్న ఉపపర్యవేక్షక ఇంజనీర్ (డీఎస్ఈ)పోస్టును భర్తీ చేశారు. పోలవరంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన ఎం.భాస్కరరావు పదోన్నతిపై బొబ్బిలి సర్కిల్‌కార్యాలయానికి డీఎస్ఈగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు బాధ్యతలుస్వీకరించిన భాస్కరరావును ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, సర్కిల్‌కార్యాలయ సూపరింటెండెంట్ మారిశెట్టి సురేశ్‌కుమార్, ఎన్‌జీవోనాయకుడు గొల్లపల్లి రామారావు,అక్కేన సతీష్‌కుమార్, సిబ్బంది అభినందించారు. చాలా రోజులుగా డీఎస్ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో పరిపాలనాపరమైన అంశాలు పెండింగ్‌లో ఉండిపోయాయని, భాస్కరరావు బాధ్యతలు స్వీకరించడంతో పెండింగ్ సమస్యల పరిష్కారానికి కదలిక వస్తుందని సురేష్‌కుమార్ తెలిపారు.

నిమ్మలపాడులో దుస్తుల పంపిణీ

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలపాడులో ఆదివారం వనమిత్ర కె.కృష్ణదాస్ ఆధ్వర్యంలో బొబ్బిలి మాజీ సైనిక సంఘం గౌరవా ధ్యక్షుడు మరడ రామినాయుడు మహిళలు, పిల్లలకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు, సామాజికవేత్తలు స్పందించి స్ఫూర్తిగా తీసుకొని సహాయం చేయడానికి ముందుకురావాలని కోరారు.

● బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లిలో అన్నపూర్ణ ఆపన్నహస్తం పేరుతో 500 రోజులుగా గ్రామంలోని వృద్ధులకు బొంతలకోటి లక్ష్మి ప్లాస్టిక్ రహిత ఆహారాన్ని అందజేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె వృద్ధులకు ఆహారాన్ని స్టీల్ క్యారియర్‌లో పంపిణీ చేశారు.

ప్రశాంతంగా ఉల్లాస్ పరీక్ష



పారాది పాఠశాలలో ఉల్లాస్ పరీక్షరాస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొర్లెసీతారాంపురం, పారాదితదితర పాఠశాలల్లో ఆదివారం ఉల్లాస్ పరీక్షప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో పి.రవికుమార్,డీఆర్‌డీఏ ఏపీఎం పి.శేషగిరిరావుతనిఖీ చేశారు.పరీక్ష కేంద్రంలో ఏర్పాటుచేసిన మౌలిక వసతులు, నిర్వహణను అడిగి తెలుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో-117ను రద్దు చేయాలి

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవో-117ను రద్దు చేసి, యూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి డిమాండ్‌చేశారు.ఆదివారం మండలంలోని రంగరాయపురం ఎంపీయూపీ పాఠశాల ఎదుట యూటీఎఫ్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యూపీ పాఠశాలలను సమీప జడ్పీ పాఠశాలలో విలీనంచేయడం వల్ల పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందని, జీవో-117ను అమలుచేయడం వల్ల యూపీ పాఠశాలలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే జీవో-117 రద్దు చేసి యూపీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.లేకపోతే ఆందోళనచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

● భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు నివాళులు

బొబ్బిలి/రూరల్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు, యువతకు నష్టం జరుగుతుండడంతో స్వాతంత్ర్య కాలం నాటి పోరాట స్ఫూర్తి మరోసారి అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు.ప్రజాస్వామ్యం, దేశసంపదకు ప్రమాదకరంగా మారిన బీజేపీ దుర్మార్గానికి వ్యతిరేకంగా ప్రజలంతా మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.ఆదివారం బొబ్బిలిలో సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు,సుఖదేవ్ వర్ధంతి పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వి.లక్ష్మి, శంకరరావు, శ్రీనివాస్, టీవీరమణ, సురేష్ పాల్గొన్నారు.అలాగే స్థానిక గిరిజన కళాశాల హాస్టల్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఈసీమెంబరు బి.రవికుమాచర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక పాతకోటలో మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు మరడ రామినాయుడు, రేవళ్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భగత్ సింగ్‌కు నివాళులర్పించారు.



బొబ్బిలిలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, ఆ పార్టీ నాయకులు

విద్యుత్ లేక.. వెలుగులకు నోచుకోక

● అటవీశాఖ నుంచి అనుమతులు రాని వైనం

● ఇదీ గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాల్లో పరిస్థితి

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోగల చినఅక్కేనవలస, నేయోనువలస, దీమోనువలస, మోసురువలస తదితర గిరిజన గ్రామాల్లో దాదాపు 200 ఆవాసాలకు విద్యుత్ సదు పాయం లేకపోవడంతో వెలుగులకు నోచుకోవడం లేదు. ఆయా గ్రామాలు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండడంతో విద్యుత్ లైన్లు వేసేందుకు అటవీశాఖ అనుమతులు ఇవ్వడలేదని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గూడేలు నేటికీ విద్యుత్ సౌకర్యానికి నోచుకోవడంలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా ఇంకా చీకటిలోనే మగ్గుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ తమ గూడేలు విద్యుత్ వెలుగులకు నోచుకోవడంలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం అమలుపై ఇక్కడ పర్యవేక్షణ లేకపోవడంతో అటకెక్కుతోంది. ప్రధానంగా అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ఒక్క అక్కేనవలసలో మాత్రమే స్తంభాలు ఏర్పాటుచేశారు. తర్వాత పనులు చేపట్టే ప్రక్రియ నిలిచిపోయింది. అనుమతులు తీసుకురావాల్సిన అధికారులు చోద్యంచూస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. ఈ పథకం మైదాన ప్రాంతాలకే పరిమితమయ్యిందని విమర్శలొస్తున్నాయి. దీంతో చీకటిపడే ముందే గ్రామాలకు పనులకు వెళ్లేవారు చేరుకోవల్సివస్తోంది. కొందరు అక్కేనవలస గ్రామస్థులు ఇళ్లపై సోలార్ పలకలు ఏర్పాటుచేసుకున్నారు. అక్కేనవలసలో స్తంభాల ఏర్పాటు చేయడంతో గోపాలరాయుడుపేట నుంచి ఒకలైన్ ఏర్పాటుచేసుకుని వీధుల్లో విద్యుత్ దీపాలను గ్రామస్థులే అమర్చుకున్నారు. మిగతా గిరిజన గ్రామాల ప్రజలు చీకటిపడితే విష జంతువుల వచ్చి కాటేస్తాయోమోనని భయాందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అటవీ శాఖ నుంచి అనుమతులు లభించేలా చర్యలు తీసుకొని తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



అక్కేనవలస వద్ద స్తంభాలు ఏర్పాటు చేసిన దృశ్యం

అనుమతులు వస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం..

గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలకు ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయని బొబ్బిలి ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి అనుమతులు తీసుకొని విద్యుత్ స్తంభాలు వేశామని, అటవీశాఖ అధికారులు ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా కోసం అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించడంతో పనులు ఆపేశామని తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు పనులు నిలిపివేయాలని నోటీసులిచ్చారని చెప్పారు. ఆ విషయంపై మూడేళ్ల కిందట అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు వస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.



జామి సమీపంలో గోస్తనీ నదిలో పేరుకుపోయిన చెత్త

డంపింగ్ యార్డుగా మారి‘నది’

● జామి వద్ద గోస్తని తీరంలో పేరుకుపోయిన చెత్త ● జలాలు కలుషితమయ్యే అవకాశం

జామి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జామి వద్ద గోస్తని నది తీరం డంపింగ్ యార్డుగా మారింది. సుమారు 15 వేల మందికిపైగా జనాభా నివస్తున్న ఇక్కడ రోజు రోజుకు చెత్త పెరుగుతోంది. ఆ మేరకు సిబ్బంది లేకపోవడంతోపాటు చెత్త నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టిసారించడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు.ప్రస్తుతం 10 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమేఉన్నారు. వాస్తవానికి సేకరించిన చెత్తను గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రానికి తరలించాల్సిఉంది. అయితే ఆ కేంద్రంగా దూరంగా ఉండడంతో గ్రామానికి ఆనుకుని ఉన్న గోస్తానీ తీరంలో చెత్తను డంప్ చేస్తున్నారు. జామి గ్రామం పరిధిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర నది ప్రవహిస్తుండగా, నదిలో భూగర్భ, నదీ జలాలు కలుషితమయ్యే ప్రమాదముందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చెత్త నిర్వహణను పర్యవేక్షించాల్సిన పంచాయతీప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యకమవుతున్నాయి. కాగా గ్రామంలో చెత్తవేసేందుకు ఎక్కడ స్థలాలు లేవని పంచాయతీ ఈవో రమణరావు తెలిపారు. గ్రామానికి దూరంగా చెత్తసంపద కేంద్రం ఉందని, అక్కడ తడిచెత్త పోడిచెత్త వేయాల్సిఉందని చెప్పారు.తమకు ఉన్న పదిమంది సిబ్బంది సేకరించే చెత్తలో ఎక్కువగా మట్టి ఉండడంతో నదిలో మట్టి వేయిస్తున్నామని తెలిపారు.

నిర్వహణ లేక.. నిరుపయోగం

● తాగునీటి కోసం తప్పని అవస్థలు

● ఇదీ రంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రంలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రంగరాయపురంలో అంగన్‌వాడీ కేంద్రానికి నీరందించేందుకు ఏడాదిన్నర కిందట ఏర్పాటుచేసిన సింథటిక్ వాటర్ ట్యాంక్ నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇక్కడకు వచ్చే చిన్నారులతోపాటు, గర్భిణులు,బాలింతలకు తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుచేశారు. నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో పైపులైన్‌తోపాటు మోటారు పాడయ్యాయి. దీంతో ట్యాంకుకు నీరందని పరిస్థితినెలకొంది. ఈరెండు పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడంతో ఇక్కడకు వచ్చే 12 మంది చిన్నారులకు తాగునీటికిఅవస్థలు తప్పడంలేదు. దీంతో పక్కనే ఉన్న ఎంపీయూపీ పాఠశాల నుంచి తాగు నీరు తీసురావాల్సివస్తోందని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. ప్రస్తుతం వేసవి కావడంతో తాగునీటితో ఇతర అవసరాలు పెరుగుతుండడంతో తక్షణమే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని నిర్వాహకులు డిమండ్ చేశారు.



అంగన్‌వాడీకేంద్రం ఆవరణలో నిరుపయోగంగాఉన్న సింథటిక్ వాటర్ ట్యాంక్

ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారు..?

● రొంపల్లికి చెందిన టీడీపీ ఎంపీటీసీసభ్యుడు భవిరెడ్డి శంకరరావు

● పలు అంశాలపై చర్చ



తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న శంకరరావు

రామభద్రపురం,మార్చి 23(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇంకెప్పుడు ఇస్తారని తహసీల్దార్ సులోచనారాణిని టీడీపీ రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలు అంశాలపై వాడివేడిగా చర్చ జరిగింది. తొలుత సులోచనారాణి నివేదిక చదువుతుండా శంకరరావు గతఏడాది రొంపల్లిలో పేదలకు ఇళ్లపట్టాల కోసం దరఖాస్తులు చేశామని, ఇప్పటికీ అతీగతీలేదని నిలదీశారు. ప్రభుత్వం ఎప్పుడిస్తుందో స్పష్టతలేదని, ప్రభుత్వం ఎక్కడున్నాయో గుర్తించాలని ఆదేశాలు రావడంతో గుర్తిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. ఉపాధిహామీ పథకం ఏపీవో త్రినాథరావు నివేదికను వివరిస్తుండగా రామభద్రపురం సర్పంచ్ వేతనదారులకు కూలి గిట్టుబాటు కావడంలేదని ప్రశ్నించారు. రోజుఉదయం, సాయంత్రం రెండు పూటలా కొలతలు ప్రకారం చేస్తే గిట్టుబాటయ్యేలా వేతనాలు పడతాయని ఏపీవో తెలిపారు. కనిమెరకవీధిలో మూడు విద్యుత్ స్తంభాలు పూర్తిగా పాడైపోయే ప్రమాదంలో ఉన్నాయని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ భవిరెడ్డి చంద్రరావు కోరారు. హౌసింగ్ ఏఈఈ రెడ్డి వేణు, ఎంఈవో తిరుమలప్రసాద్, ఏపీవో వెంకటయ్య తదితర అధికారులు తమ నివేదికలను వివరించారు. అనంతరం చొక్కాపు లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈకి సూచించారు. మౌలిక సదుపాయల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో రత్నం, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు పాల్గొన్నారు.

గ్రామ పురోణీలపై ఆరా

(5వ పేజీ తరువాయి)

వీటి క్రమబద్ధీరణకు జీవో ఇచ్చింది. గ్రామాల్లో మెట్టు ఐదు ఎకరాలు, పల్లం 2.50 ఎకరాలలోపు ఉన్న భూములకు స్టాంప్ డ్యూటీ లేకుండా క్రమబద్ధీకరణ చేసేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటిలో 1,09,695 దరఖాస్తులు వచ్చాయి. అంతా సిద్ధం చేసిన తరుణంలో 2019లో సాధారణ ఎన్నికలు రావడం.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి మారిపోయింది. గత ప్రభుత్వం భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టింది కానీ సర్వేలో కొత్త సమస్యలను తెరపై తెచ్చిన గ్రామ పురోణిలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంలో భాగంగా సాదాబైనామాల క్రమబద్ధీకరణ దిశగా అడుగులు వేస్తోంది. నాలుగు రోజులు క్రితం మండలాల పరిధిలో గ్రామ పురోణీలపై తహసీల్దార్ల నుంచి కలెక్టరేట్ అధికారులు ఆరా తీశారు. వీటిపై ఎలా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయాలు సేకరించారు. ఆ నివేదికను రాష్ట్ర సీసీఎల్ఏకు పంపించారు. వీటిపై కొద్ది రోజుల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇదే విషయమై జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి వద్ద ప్రస్తావించగా సాదాబైనామాలపై తహసీల్దార్ల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించామని వెల్లడించారు.

గృహానందం

(ఐదో పేజీ తరువాయి)

2024 డిసెంబరు 10 నాటికి మధ్యలో ఆగిన ఇళ్లకు మాత్రమే ఈ అదనపు సాయం వర్తిస్తుంది. పూర్తికాని ఇళ్లకు సంబంధిత సచివాలయ సిబ్బంది లేదా ఇంజనీరింగు సహాయకులు ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో సుమారు 15,226 మందికి లబ్ధి చేకూరనుంది. వీరిలో ఎస్సీలు 2,231, ఎస్టీలు 565, బీసీలు 12,240, ఆదివాసీ గిరిజన తెగలు 190 మంది ఉన్నారు. వచ్చే రెండు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణానికి ఇది అనుకూలమైన సమయం. అదనంగా ఆర్థిక సాయం చేయడమే కాకుండా, ఇసుకను కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలి.

-కలెక్టర్ అంబేడ్కర్

ఇంటి నిర్మాణం పూర్తిచేస్తాం..



గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరైంది కానీ రూ.లక్ష 80 వేలు సరిపోక నిర్మాణాన్ని మధ్యలో ఆపేశాను. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న సాయంతో రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు.

-పతివాడ పైడితల్లి, గొడ్డుపాలెం, డెంకాడ మండలం

చాలా ఆనందంగా ఉంది..



ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఇంటికోసం ఇచ్చిన డబ్బులు ఏ మూలకు సరిపోలేదు. ఇప్పుడు మరో రూ.50 వేలు వస్తుండడంతో వచ్చే రెండు నెలల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేస్తాం.

-పతివాడ రమణమ్మ, గొడ్డుపాలెం, డెంకాడ మండలం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు..



చాలా సంతోషంగా ఉంది. మా లాంటి పేదల కష్టాలు తెలుసుకుని ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి అదనంగా డబ్బులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు. ఈ డబ్బులు వినియోగించి రెండు నెలల్లో ఇంటిని పూర్తి చేసుకుంటాం.

-దుప్పాక మంగమ్మ, భోగాపురం

యూపీ స్కూల్‌ను కొనసాగించాలి

● ఏపీఎస్‌జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్

బొబ్బిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎం.బూర్జివలసలో యూపీ స్కూల్‌ను ఎత్తి వేయకుండా కొనసాగించాలని ఏపీఎస్‌జేఏసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి బి.సాయి కిరణ్ యాదవ్ డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక పూల్‌బాగ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎం.బూర్జివలస యూపీ స్కూల్‌లో ప్రస్తుతం 20 మంది విద్యార్థులు ఉన్నారన్న నెపం చూపిఎత్తివేసి గ్రామానికి దూరంగా గల పెంట జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేయడం తగదన్నారు. గ్రామానికి దూరంగా పెంట హైస్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. పాఠశాలలోవిద్యార్థులసంఖ్యను పెంచి అక్కడే కొనసాగించాలని కోరారు. గ్రామపెద్ద లతో సమన్వయంగా అధికారులు పనిచేసి యూపీస్కూల్ తరలిపోకుండా చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని తెలిపారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చంద్ర శేఖర్, మహేశ్, నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్‌జేఏసీ నాయకులు